తెలుగు జ్యోతి రచనలపోటీలో ద్వితీయ బహుమతి పొందిన
వ్యాసము పురస్కార ప్రదాతలు సిలికానాంధ్ర సంస్థ

# ప్రేమంటే...

**- పాలంకి సత్య**



పెళ్ళీడు పిల్లలున్న ప్రతి భారతీయకుటుంబంలోనూ - వారు ఇండియాలో ఉన్నా, విదేశాలలో ఉన్నా - చాలా సార్లు ప్రేమపెళ్ళిళ్ళ గొప్పతనం మీద వాదోపవాదాలు జరుగుతాయి. పెద్దవాళ్ళకు పిల్లలు తాము చెప్పిన వారిని చేసుకుంటే బాగుండు ననిపిస్తుంది. పిల్లలకు తాము స్వయంగా వలచి వరించాల నిపిస్తుంది. పిల్లలకీ, పెద్దలకీ జరిగే వాదంలో "అసలు ప్రేమంటే ఏమిట"ని పెద్దలు అడగడమూ, "అది నీకర్థం కాదు. అది వివరించలేని భావం" అంటూ పిల్లలు చెప్పడమూ పరిపాటి. మా తరానికి ప్రేమంటే తెలియదని యువతరం నమ్మకం. ఈ నమ్మకమూ తరతరాలుగా వస్తున్నదే. అయిదువందల ఏళ్ళనాడు పృధ్వీరాజుని ప్రేమించిన సంయుక్త తండ్రి జయచంద్రుడితో "నీకు ప్రేమంటే అర్థం కాద"నే చెప్పిందేమో!

ఇంతకీ ప్రేమంటే ఏమిటి? ఈ ప్రశ్న రెండు వేల ఏళ్ళనాడు ఆంధ్రశాతవాహనచక్రవర్తి హేలుడికి వచ్చింది. ఆయనా ప్రేమించి పెళ్ళి చేసుకున్నవాడే. సింహళ (నేటి శ్రీలంక) రాజుతో ఆయనకు వైరం, రాజకుమార్తె లీలాలలితపై ప్రేమ. కథ చివరకు సుఖంతామైంది. ద్రాక్షారామం అనే తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో వివాహం జరిగింది. సంయుక్తా, పృధ్వీరాజుల కథ సుఖాంతం కాలేదు. పృధ్వీరాజు ఓటమితో కథ ఆగిపోలేదు. భారతదేశమే విదేశీయుల పాలనలోకి వెళ్ళిపోయింది. ప్రేమికులజంటను పెద్దలు ఆశీర్వదించడమే అన్ని విధాలా శ్రేయోదాయకమన్న అంతర్లీనమైన నీతిసూత్రం భగవంతుడే చరిత్ర ద్వారా సూచించాడా? ఆయనే రుక్మిణి కబురంపితే ఆమెవద్దకు వెళ్ళి, ఆమెను తనతో ద్వారకకు తెచ్చుకున్నవాడు కదా!

హేలచక్రవర్తి ప్రేమ గురించి అనేక కవులు రాసిన గాథలను సేకరించి, గ్రంథంగా కూర్చాడు. ఆ కథలన్నీ రాజులూ, రాజాశ్రయంలోని కవులూ రాసినవి కావు. సామాన్య గ్రామీణులూ అమాయకులైన ఆటవికులూ ప్రేమైకజీవనంలోని మాధుర్యాన్ని తెలియ చెప్పారు. ముందుగా మాధవీదేవి తాను ప్రేమించే వాడిలో కోరుకునే లక్షణాలను ఘంటాపథంగా చెప్పింది.

దొరతనంబు తమది నెఱపక, దాసులు



Telugu Jyothi Special Issue April 08

బోలె నలుక గొన్నవేళ దేర్చు
వారె ప్రియులు సుమ్మ వనితల కొరులెల్ల
పనికి రాని వట్టి భర్తలంతె.

భర్త అనేవాడు అధికారం చెలాయిం చకుండా, అలిగినవేళ "త్వం శుంతా అంటే త్వం శుంతా'' అనకుండా అలుకతీరిస్తే ప్రియుడవుతాడు. లేనినాడు పనికిరానివాడే.

అధికారం చెలాయించకుండా గాఢంగా ప్రేమించే భర్త నుంచి స్త్రీలు ఏ నగలనూ, డబ్బునీ ఆశించరు. అటువంటి మధురమైన ప్రేమానుభవం ఒక బోయనాయకుడికి కలిగింది.

మత్త గజకుంభముల పుట్టుముత్తియముల
తొడవులను దాల్చు సవతులనడుమ కురుల
నెమలి యీకలు గొన్ని సొన్పికొని బోయ
పడుచు పెండ్లాము పొగరుతో నడుచు గంటె

అరణ్యమధ్యంలోకి కొన్ని రోజులపాటు వేటకు వెళ్ళి మత్తగజాలను కొట్టి వాటి కుంభస్థలాలలోని ముత్యాలను భర్త తెచ్చి ఇస్తే స్త్రీలు ఆ ముత్యాల నగలు ధరించారు. కానీ ఒక బోయవధువుకి భర్త సాన్నిధ్యంలో, అతని ప్రేమలోనే ఆనందం. సులభంగా దొరికే నెమళ్ళని వేటాడితే నెమలి ఈకలనే గర్వంగా ధరించింది. ఆనందంగా తిరిగింది. ధనంతో సంబంధంలేని ప్రేమ ఎంత గొప్పదో కదా!

ప్రేమ ఉన్న చోట నగలనే కాదు ముఖ్యావసరమైన ఆహారం విషయంలో కూడా ఆశ ఉండదు. ఒక పేద ఇల్లాలికి నెలతప్పింది. ఆ సమయంలో ఎన్నో రకాల ఆహారపదార్థాల మీదకు మనస్సు పోతుంది. గర్భవతి అయిన భార్యను ఏం తినాలని ఉందని భర్త అడిగితే "ఆకలి లేదు. మంచినీళ్ళు మాత్రమే కావాలి'' అందట. భర్త అంతకన్నా ఏమీ తేలేడని ఆమెకు తెలుసు. అతని మనస్సు నొప్పించడం ఆమెకు ఇష్టం లేదు. ఇది ప్రేమకు నిర్వచనం కాదా?

ప్రాణంలో ప్రాణంగా ప్రేమించే భార్య మరణిస్తే భర్త గతి ఏమిటి? మగవారిలోను గాఢంగా ప్రేమించే వారు, ప్రియసతికై పరితపించేవారు ఎందరో ఉంటారు. (భార్య తప్పిపోయి మరణించిందనుకుని మారుమనువు చేసుకునే సినిమా హీరోల్లా అందరూ ఉండరు). ఒక రైతు భార్య మరణాన్ని తట్టుకోలేని స్థితివర్ణన హృద్యంగా ఉన్న పద్యమిదిగో...

ప్రీతిపాత్రమైన పెండ్లాము సచ్చిన
యింటి పాడు చూచి యేడ్వలేక
చనడు పొలము విడిచి పని లేకయున్నను
పామరుండు చూడు పల్లెకాపు

భార్యలేని ఇంటికి వెళ్ళకుండా, పనిలేకపోయినా పొలంలోనే ఉండిపోయాడట రైతు.

ఇక ప్రేమ అనేది భార్యాభర్తలకూ, ప్రేమయసీ ప్రియులకే పరిమితంకాదు. కొడుకుని ప్రాణాధికంగా ప్రేమించే తల్లులూ కోకొల్లలు. కోడల్ని కూతురికన్నా ప్రేమగా చూసుకునే అత్తలున్నారు. తల్లీ, కొడుకూ, కోడలూ అన్యోన్యంగా ఉన్న కుటుంబంలో కొడుకు పని మీద వేరే ఊరు వెళ్ళవలసివచ్చింది. చాలా రోజులదాకా తిరిగిరాలేదు. కారణం తెలుసుకోవడానికైనా ఈనాటి సాధనాలు లేవు.ఏమయ్యాడోనని తెలియక బాధ పడుతున్న కోడల్ని ప్రేమగా, జాగ్రత్తగా చూసుకోవాలన్న కోరిక ఉంది.

నేడు పండువు నాడు; నీ ప్రియుండు
వచ్చునిజముగ నేడువవలదు బిడ్డ
అనుచుకోడలినోదార్చి కొనుచు
మొగము
నావలకు ద్రిప్పి తానేడ్చు నత్తగారు.

అత్త "ఈవేళ పండగ, నీ ప్రియభర్త తప్పక వస్తాడు, ఏడవకు'' అని కోడలికి చెప్పి తాను ఆమెకు తెలియకుండా ఏడిచింది. ఇటువంటి అత్త ప్రేమ పొందడం కన్నా భాగ్యమేముంది?



Telugu Jyothi Special Issue April 08

ప్రేమ అన్నది, నేటి యువతరం (ఆమాటకొస్తే ప్రతితరంలోని యువతరం) చెప్తున్నట్లుగా ఒక అనిర్వచనీయమైన భావమే. భర్తృహరి చెప్పిన సాయంకాలం నీడలా పెరిగేది నిజమైన ప్రేమ. భార్యకు అనారోగ్యం కలిగినప్పుడు భర్త తనకు గాఢనిద్రపట్టకుండా చాపమీద పరుపులేకుండా పడుకోడంలో ప్రేమ ఉంది. "కృష్ణమార్గగతవీక్షణ పంక్తులు" తిప్పని రుక్మిణి మనస్సులో ప్రేమఉంది. ఆఖరి అప్పడం సమంగా పంచుకుని తినే అన్నా చెల్లెళ్ళ అనుబంధంలో ప్రేమ ఉంది. అమెరికా నుంచి అమ్మానాన్నలకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఇ-మెయిల్ పంపేకొడుకు బాధ్యతాయుతప్రవర్తనలో ప్రేమ ఉంది. తమకోరికల కన్నా పిల్లల భవిష్యత్తుకి విలువనిచ్చే తల్లితండ్రుల హృదయంలో ప్రేమ ఉంది.

కష్టాలనే అగ్ని పరీక్షకు తట్టుకు నిలబడినదే నిజమైన ప్రేమ. వేలన్‌టైన్స్ డే నాడు వజ్రపు ఉంగరం బహుమతి ఇవ్వగలిగితేనే ప్రేమ అనుకుంటే... కొన్నాళ్ళకు "ప్రేమ - ఈ కార్యక్రమ ప్రాయోజకులు..." అనే ప్రకటన స్థాయికి ప్రపంచం దిగజారే ప్రమాదముంది. "ఆత్మవత్ సర్వభూతాని" చూడ గలగడమే అసలైన ప్రేమకాదా?

**_పాలంకి సత్య_**

స్వగ్రామం కాకరపర్రు అయినా పుట్టిందీ, పెరిగిందీ మద్రాసులో. శ్రీవారు పాలంకి సత్యనారాయణ (రచయిత) మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి గణితంలో. ఎకనమిక్స్‌లో పి.జి.డిగ్రీని, సంస్కృతంలో గోల్డ్ మెడల్ నీ, పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నుండి జ్యోతిష్యంలో పి.జి. డిగ్రీ అందుకున్నారు. విరివిగా కథలూ, నవలలూ, వ్యాసాలూ వ్రాసి అనేక పురస్కారాల్నీ, బహుమతులని పొందారు.

---

బియ్యపు గింజలన్ చిగురు పేడిన గంధపు పచ్చి బొట్టు తో
తియ్యని నీ నొసలి తీరులు కుంకుమ తీర్చి ముంగిలన్
తొయ్యలి నోము చారికలతో పసపాడిన ముద్దరాలు నీ
పయ్యెద వ్రాలు నీవు నతి పట్టిన దీవన లీయ జూచెడున్

**విశ్వనాథ**



Telugu Jyothi Special Issue April 08